క్లుప్తంగా

వైద్యులకు రక్షణ కల్పించాలి



జేసీకి వినతిపత్రం అందిస్తున్న ఐఎంఏ సభ్యులు

అమలాపురం రూరల్: పట్టణంలో ఇటీవల వైద్యులు, ఆసుపత్రులపై జరిగిన దాడులను ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ జేసీ నిశాంతికి బుధవారం వినతి పత్రం అందజేసింది. ఆసుపత్రుల్లో వైద్యులకు రక్షణ కల్పించే చట్టాన్ని అమలు చేయాలని, ఆ దాడులకు బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ఆ వినతిపత్రంలో సభ్యులు కోరారు. దీనిపై స్పందించిన జేసీ త్వరలో అధికారులుతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఐఎంఏ కోనసీమ జిల్లా కార్యదర్శి డాక్టర్ వైటీ నాయుడు, సీనియర్ వైద్యులు పీఎస్ శర్మ, ఏవీఎస్ రాజు తదితరులు జేసీని కలిసివారిలో ఉన్నారు.

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

అమలాపురం రూరల్: జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలలో పరిశ్రమల అభివృద్ధికి, ఎగుమతుల పెంపుదలకు అవసరమైన అనుమతులు, రాయితీల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో 16వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశాన్ని ఆయన అధ్యక్షతన నిర్వహించారు. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద 59 యూనిట్లకు ఆమోదం తెలిపారు. జిల్లాలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ మేజర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ కింద క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకం ద్వారా వ్యవసాయ అనుబంధ విలువ ఆధారిత యూనిట్లు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఉత్పత్తి, ఎగుమతుల లక్ష్యాల సాధనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం అరుణ, ఏడీ శివరాం ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ గాంధీ తదితర అధికారులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ల నిర్మాణ స్థలాల పరిశీలన

యానాం: రెండేళ్లలో రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణ నేపథ్యంలో యానాం గౌతమీ గోదావరి తీర ప్రాంతానికి వచ్చే వేలాది మంది భక్తుల కోసం ఏర్పాటుచేసే పుష్కర ఘాట్ల నిర్మాణ స్థలాలను బుధవారం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ అంకిత్‌కుమార్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. గతంలో జరిగిన పుష్కరాలకు యానాం పుష్కర ఘాట్ల వద్దకు వేలాదిగా భక్తులు తరలివచ్చి, పుణ్యస్నానాలు ఆచరించారని తెలిపారు. ఈసారి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత ఏర్పాట్లు చేయడానికి పుదుచ్చేరి ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపినట్టు వారు తెలిపారు. రూ.2కోట్లు మంజూరు చేయాలని ఎల్జీ కె కైలాషనాథన్‌కు వినతిపత్రం అందించినట్లు మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఇంజినీర్లు జ్యోతిరాజు, సుదీర్, మురళి పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కోనసీమ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అమలాపురం రూరల్: బుద్ధ విహార్‌లో బుధవారం రాత్రి ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఎండీ అబ్దుల్ రహీం, ప్రధాన కార్యదర్శిగా కె.రామచంద్రం, ఉపాధ్యక్షుడిగా జీసామ్సన్, ఎస్.సుధారాణి, కార్యదర్శులుగా ఎండీ సిరాజ్, ఎస్‌లల్లీ, పి.సుజాత ఎన్నికయ్యారు. డివిజన్ అధ్యక్షుడిగా జే.మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వాహకులుగా రాష్ట్ర ఏపీపీటీయూ కార్యదర్శి బీపీ సాల్మన్ రాజు, పరిశీలకులుగా పాండురంగప్రసాద్‌రావు వ్యవహరించారు

ఆక్వా రైతుల సమస్యలపై వినతి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఆక్వా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం పుదుచ్చేరి ఎంపీ వైతిలింగంకు ఆక్వా రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు ఈలప్రోలు విష్ణువర్ధనరావు ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా సాగుకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా సౌకర్యం, విద్యుత్ సబ్సిడీ తదితర ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరారు. దరియాలతిప్ప ఐలాండ్ నంబరు-5 వద్ద గోదావరిలో ఇటీవలి ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీకేజీతో ఏర్పడ్డ అగ్నిప్రమాదానికి సంబంధించి బాధితులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రిటైర్డ్ ఆర్‌ఏఓ గిడ్డి బలరామ్, గ్రామ పెద్ద సబ్బతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపీ వైతిలింగంకు వినతిపత్రం అందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

అమలాపురం టౌన్: యువత ఎయిడ్స్, హెచ్ఐవీపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సీహెచ్‌వీ భరతలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద ఎయిడ్స్ నియంత్రణ అవగాహన ర్యాలీని ఆమె బుధవారం రాత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్‌పై సంచార సమాచార వాహనాల్లో ప్రదర్శిస్తున్న వీడియోలు సామాన్య ప్రజలకు సైతం అవగాహన అయ్యే రీతిలో ఉన్నాయని చెప్పారు. ఈ ర్యాలీలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ పి.బాలాజీ, జిల్లా సూపర్‌వైజర్లు ఎ.బుజ్జిబాబు, రామానాయుడు, రత్నరాజు పాల్గొన్నారు.

నాడు ఘనం.. నేడు దీనం

- నష్టాల బాటలో కోరంగిలోని వెలుగు మహిళా మార్ట్
- నరకులు అందుబాటులో లేక వెలవెల
- అమ్మకాలు తగ్గి కళతప్పిన వైనం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోరంగిలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్ (ఫైల్)

తాళ్లరేవు: మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌లు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తిరోగమనంలో ఉన్నాయి. మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడంతోపాటు గ్రామీణ ప్రాంత వినియోగదారులకు తక్కువ ధరలకే సరుకులు అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళా మార్ట్‌లను ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహించింది. కూటమి ప్రభుత్వం మహిళా మార్ట్‌ల పట్ల నిర్లక్ష్యం వహించడంతో అవి చాలా వరకూ నష్టాల బాట పట్టాయి. మహిళా మార్టుల్లో పూర్తిస్థాయిలో సరకులు అందుబాటులో ఉంచకపోవడంతో ఇక్కడికి రావడానికి కొనుగోలుదారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో నిత్యం వినియోగదారులతో కళకళలాడే మార్ట్‌లు ప్రస్తుతం సరుకులు లేక, వినియోగదారులు రాక వెలవెలబోతున్నాయి.

కార్పొరేట్‌ను తలదన్నేలా ఏర్పాటు

గత ప్రభుత్వంలో కార్పొరేట్ మార్ట్‌లకు ధీటుగా ఏర్పాట్లు చేయడంతోపాటు అన్ని రకాల వస్తువులను అందుబాటులో ఉంచి తక్కువ ధరలకే వస్తువులను విక్రయించేవారు. మండల పరిధిలోని కోరంగి గ్రామంలో సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ఏర్పాటును ఏర్పాటు చేసారు. మార్ట్ నిర్వహణకు అవసరమైన వ్యాపార మెలకువలు, కంప్యూటర్ పరిజ్ఞానం వంటి వాటిపై ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి మార్టులను విజయవంతంగా నడిపించారు. దీంతో ఏర్పాటు చేసిన కొద్దిరోజులకే ఈ అవి లాభాల బాటలో పయనించింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు కూడా లాభాలను అందించే లక్ష్యంతో వారిని భాగస్వాములను చేసారు. దీనిలో భాగంగా ఒక్కొక్కరి నుంచి రూ.200 వాటా ధనం సేకరించారు.

రూ.45 లక్షలు పెట్టుబడితో వ్యాపారం ప్రారంభం

తాళ్లరేవు మండలంలో ఉన్న 2211 మహిళా స్వయం శక్తి సంఘాలకు 22,937 మంది నుంచి సుమారు రూ.45 లక్షలు పెట్టుబడి పెట్టి వ్యాపారం ప్రారంభించారు. కార్పొరేట్ మార్ట్‌లకు ఏమాత్రం తీసిపోని విధంగా సకల ఏర్పాట్లు చేసి, ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర వస్తువుల తోపాటు, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల ప్రత్యేకత కలిగిన వస్తువులను సైతం ఈ మార్ట్‌ల్లో విక్రయించేవారు. ఈ మార్ట్‌ల్లో ఏసీ సౌకర్యం ఏర్పాటు చేసి వ్యాపార లావాదేవీలు నిర్వహించారు.

వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా ఏర్పాటు

వ్యాపార రంగంలో వస్తున్న నూతన ఒరవడులను గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అందుబాటులోకి తెచ్చారు. వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ మహిళా మార్ట్‌లు మండల మహిళా సమాఖ్యకు ఆర్థికపరంగా అండగా నిలిచాయి. బహిరంగ మార్కెట్‌లో ధరల కంటే తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు విక్రయించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరింది.

నాడు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం

కేవలం మూడు నెలల వ్యవధిలోనే అత్యధిక లాభాలు ఆర్జించి కోరంగి మహిళా మార్ట్ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మహిళా సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించడమే ధ్యేయంగా, గ్రామీణ ప్రాంతాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మార్ట్‌ల నిర్వహణపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అమ్మకాలు భారీగా తగ్గిపోయి నష్టాల బాట పట్టాయి. కనీసం మార్ట్ అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించలేని స్థితిలో నేడు మార్ట్ నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. ఒకప్పుడు అమ్మకాల్లో రాష్ట్రస్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచి అవార్డు పొందిన కోరంగి మహిళా మార్ట్ ప్రస్తుతం సరుకులు లేక అమ్మకాలు జరగక దివాలా తీసింది. ఒకప్పుడు వినియోగదారులతో కళకళలాడిన ఈ మార్ట్ ప్రాంగణం నేడు వెలవెలబోతోంది. మహిళా మార్ట్ ప్రాంగణం సైతం పిచ్చిమొక్కలతో కళా విహీనంగా మారింది. మహిళా మార్ట్ పరిస్థితి రేపో మాపో మూసివేత దిశకు చేరడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టిసారించి పూర్వవైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



నాడు: కొనుగోలుదారులతో కళకళలాడుతున్న కోరంగి మహిళా మార్ట్ (ఫైల్)



నేడు : సరుకులు, కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న కోరంగిలోని వెలుగు మహిళా మార్ట్



ప్రస్తుతం పిచ్చి మొక్కలతో కళావిహీనంగా మారిన మహిళా మార్ట్ ప్రాంగణం

బ్యాడ్మింటన్‌లో సిరి హాసిని ప్రతిభ



స్టేట్ బ్యాడ్మింటన్ పోటీల్లో రెండు విభాగాల్లో రన్నర్‌గా నిలిచిన సిరి హాసిని

అమలాపురం టౌన్: అనంతపురంలో ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకూ నిర్వహించిన యోనెక్స్ -సన్ రైజ్ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ (అండర్-17) బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో అమలాపురానికి చెందిన క్రీడాకారిణి తిక్కిరెడ్డి సిరి హాసిని ప్రతిభ చాటి రెండు విభాగాల్లో రన్నర్‌గా నిలిచింది. ఈ బ్యాడ్మింటన్ పోటీల్లో సిరి హాసిని మిక్స్‌డ్ డబుల్స్, గర్ల్ డబుల్స్‌లో ఈ రెండు విభాగాల్లో విజయం సాధించి ట్రోఫీలను కైవసం చేసుకుంది. సిరి హాసిని కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ తిక్కిరెడ్డి సురేష్‌కుమార్ కుమార్తె. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మెట్ల సూర్యనారాయణ, అధ్యక్షుడు మెట్ల రమణబాబు, గౌరవాధ్యక్షురాలు రంకిరెడ్డి రంగమణి విశ్వనాథ్ తదితరులు సిరి హాసినిని అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



సుంకరపాలెం చింతాకులవారిపేటలో సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

తాళ్లరేవు: సుంకరపాలెం చింతాకులవారిపేటలో నిర్మిస్తున్న సీసీ రహదారులను గ్రామ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే స్తంభాలు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులకు సత్కారం



సీఈసీ సభ్యురాలు అనురాధను శాలువాతో సత్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి



సీఈసీ సభ్యుడు పితాని బాలకృష్ణను సత్కరించిన తాళ్లరేవు మండల నేతలు

అల్లవరం: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఇటీవల నియమితులైన మాజీ ఎంపీ చింతా అనురాధను అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్రమణి బుధవారం మొగళ్లమూరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాల, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైఎస్ చైర్మన్ రుద్రరాజ నానిరాజు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మీ, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లూరి సురేష్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధా గణపతి, కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయ్, పార్టీ నాయకులు కుడుపూడి శ్రీను, కడలి లక్ష్మణరావు, మోసుగంటి సింహాద్రి, గెద్దాడ సింహాద్రి, నిమ్మకాయల శేఖర్, జాన్‌తాతారావు, కొనుకు బాబురావు తదితరులు అనురాధకు శుభాకాంక్షలు తెలిపారు.

పితాని, మునికుమారికి అభినందనలు

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన పితాని బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన కాశి బాలమునికుమారిని బుధవారం తాళ్లరేవు మండల నాయకులు కలిసి అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, ముమ్మిడివరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రేవు మల్లీశ్వరి, మండల ప్రధాన కార్యదర్శి బొంతు వీరమోహన్, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల జగదీశ్వరరావు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, నాయకులు రేవు నాగేశ్వరరావు, పెయ్యల శ్రీనువాస్, నీలపాల శ్రీను తదితరులు నేతలను కలిసి దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు పందిరిపల్లి రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి మోకా మధుబాబు తదితరులు బాలకృష్ణ, బాలమునికుమారిని కలిసి సత్కరించి, అభినందించారు.

వృద్ధుల హక్కులపై అవగాహన అవసరం



రచయిత్రి సుధను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వృద్ధులు (సీనియర్ సిటిజన్స్) తమ హక్కులు, చట్టాలు, సంక్షేమంపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఏవై శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమలాపురం అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమెల్లి విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాకినాడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుద్ధరాజు సత్యనారాయణరాజు, పెండ్యాల శ్రీదేవి, అమలాపురానికి చెందిన డాక్టర్ కె.శ్రీమన్నారాయణరావు మాట్లాడుతూ వృద్ధుల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురి సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అమలాపురానికి చెందిన ఆర్య వైశ్య నాయకురాలు, రచయిత్రి పచ్చిగోళ్ల సుధ ఇటీవల గాంధీ జయంతి రోజున హైదరాబాద్‌లో గాంధీ ఇన్‌స్పిరేషన్ అవార్డును స్వీకరించిన సందర్భంగా అసోసియేషన్ తరఫున ఆమెను ఘనంగా సత్కరించా. అప్పనపల్లికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు సత్యనారాయణ ఇటీవల కాశీలో 9 నెలల పాటు భక్తులకు సేవలందించిన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోయేషన్ కార్యదర్శి నూలు సూరిబాబు, కోశాధికారి శ్రీఘాకోళపు రాంపండు, ముఖ్య సలహాదారు నంబూరి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణలో భాగస్వాములు కండి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎఫ్ఓ రామచంద్రరావు

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడే వన్యప్రాణులను సంరక్షించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా అటవీ అధికారి ఎస్.రామచంద్రరావు కోరారు. బుధవారం చొల్లంగిలోని సీబీఈటీ (కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం) కేంద్రంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోనే రెండవ అతిపెద్ద అటవీ ప్రాంతమైన మడ అడవులను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తూర్పున పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న కోరింగ అభయారణ్యంలో మరిన్ని పర్యాటకులకు హంగులు కల్పిస్తామని తెలిపారు. అభయారణ్యం అభివృద్ధికి, వన్యప్రాణుల సంరక్షణకు అనేక కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేస్తున్న ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్‌ను డీఎఫ్ఓ అభినందించారు. వారోత్సవాల సందర్భంగా జిల్లాలోని 84 పాఠశాలల నుంచి సుమారు 630 మంది విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. అనంతరం పర్యాటక బోటులో ఈడీసీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు, కె.సిద్ధార్థ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.మహేష్, కె.ధనుంజయరావు, జి.గోపీ నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి పాల్గొన్నారు.

రసరమ్యంగా సుందర కాండ పారాయణ



సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న ఆలయ మహిళా భక్త సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలోని మహిపాలవీధిలోని శ్రీ లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో శ్రీరామానంద స్వామి శిష్య బృందంతో బుధవారం నిర్వహించిన సుందర కాండ పారాయణ రసరమ్యంగా సాగింది. శ్రీరామానంద శిష్యులైన విశ్రాంత ఎస్‌బీఐ ఉద్యోగి సుబ్బారావు దంపతులు సుందర కాండను వీనుల విందుగా వినిపించారు. 108 ఆలయాల్లో 108 సుందర కాండ పారాయణ పూర్తి చేసిన సుబ్బారావు దంపతులను మహిపాల వీధి మహిళలు ఘనంగా సత్కరించి అభినందించారు. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ రాళ్లపల్లి పాపయ్యశర్మ, ఆలయ అర్చకులు ఈమని సాయి కృష్ణ శర్మ, గోకరకొండ కృష్ణ బలరామ గోవింద రావు, మహిళా భక్త సంఘం ప్రతినిధులు సంగినీడి బేబి, నరసింహారావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు బలభద్రుని సుబ్రహ్మణ్యం, సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

అమలాపురం టౌన్: రాయవరంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదం అత్యంత బాధాకరమని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. తయారీ కేంద్రంలో బాణసంచా పేలుడు ఘటనలో మృతి చెందిన వారికి ఆయన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.50 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అమలాపురంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో వెంకటేశ్వరావు మాట్లాడారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల జిల్లాలో ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. గతేడాది అమలాపురంలో, ఇటీవల అయినవిల్లి మండలం విలసలో ఈ తరహాలోనే అగ్ని ప్రమాదాలు జరిగినా కనువిప్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృత్తం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ ప్రతినిధులు జి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం



సీజేఐపై దాడిని నిరసిస్తూ అమలాపురంలో ధర్నా చేస్తున్న పలు ప్రజాసంఘాల ప్రతినిధులు



అమలాపురంలో ధర్నా నిర్వహిస్తున్న దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయ్‌పై కోర్టు హాలులో జరిగిన దాడిని నిరసిస్తూ అమలాపురం గడియారం స్తంభం సెంటరులో పలు ప్రజా సంఘాల ప్రతినిధులు బుధవారం ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన ఘటనను పోలీసులు తక్షణమే సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ, ఏఐటీయూసీ, డీహెచ్‌పీఎస్, బీకేఎంయూ సంఘాలు ధర్నా చేపట్టి నిసనన తెలిపాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, ఏఐటీయూసీ ప్రతినిధి ఉండ్రు వెంకటేష్, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా శ్రీనివాసరావు, బీకేఎంయూ నాయకుడు రొక్కాల, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల బాబి, ఏపీ కూలీ సంఘం జిల్లా ప్రతినిధి మట్టపర్తి ప్రసాద్ పర్యవేక్షణలో ఈ ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ నిరసన : సీజేఐపై దాడిని బీఎస్పీ జిల్లా శాఖ నాయకులు ఖండించారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద బీఎస్పీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గెడ్డం సంపదరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు నిరసన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి కోణాల ప్రకాష్, పలు నియోజక వర్గాల పార్టీ ఇన్‌చార్జిలు నిరసన తెలిపారు.

న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన

ముమ్మిడివరం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయిపై దాడిని నిరసిస్తూ ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం తమ విధులు బహిష్కరించి రిలే దీక్ష చేపట్టారు. కోర్టు భవనం ఎదుట బార్ ప్రెసిడెంట్ వడ్డినాగేశ్వరరావు ఆధ్వర్యంలో దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. న్యాయవాదులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, తిరికోటి శాంతి సుధ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసన

అమలాపురం టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)పై దాడి చేయడం అప్రజాస్వామికమని అమలాపురంలోని దళిత ప్రజా సంఘాల నేతలు అన్నారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ దళిత ప్రజా సంఘాల ప్రతినిధులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం రాత్రి ధర్నా నిర్వహించారు. దళిత ప్రజా సంఘాల నాయకులు కారెం వెంకటేశ్వరావు, రేవు తిరుపతిరావు, అమలదాసు బాబూరావు, దుక్కపాటి తస్యనారాయణ, కొండా దుర్గారావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడిద రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



దుర్గాచరణ్ (ఫైల్)

అమలాపురం రూరల్: ఈ నెల 5న అమలాపురం మండలం బండారులంకలో సాయి బాబా ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సమనస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై అంబాజీపేట వెళ్తుండగా బండారులంకలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లింగోలు శేషగిరి (20) అక్కడికి అక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన మరో యువకుడు చవ్వాకుల దుర్గాచరణ్ (20) కాకినాడ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శేఖర్ బాబు తెలిపారు.

వీరేశ్వర స్వామి సేవలో జెడ్పీ సీఈవో

ఐ.పోలవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ సీఈవో లక్ష్మణ్‌రావు దంపతులు బుధవారం మురమళ్ల వీరేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వీరికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం అందించి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం వారు నిత్య కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా విజయ బేతాళ స్వామి సంబరం



పేరూరులో బేతాళస్వామి ఊరేగింపు

అమలాపురం రూరల్: పేరూరులోని పురాణ ప్రసిద్ధి గాంచిన విజయబేతాళ స్వామి దసరా సంబరాలు అదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. 1947 నుంచి శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉత్సవలు 78 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భేతాళ స్వామికి ఆలయంలో పూజలు నిర్వహించి గ్రామంలో ఉత్సవాలు ప్రారంభించారు. తోట్లపాలెం, తలుపుల తోట, రాయుడువారి మెరక, పెచ్చెట్టి సుబ్బయ్య మెరక, లంకతోట, రామయ్య చెరువు గట్లకు చెందిన ఏనుగులు, 15 దేవతామూర్తుల వాహనాలను గ్రామ పురవీధుల్లో మేళతాళాలు, బాజా భజంత్రీలతో ఊరేగించారు. మంగళవారం అర్ధరాత్రి భారీ బాణసంచా కాల్పులు, బ్యాండ్ మేళాలు, కేరళ కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శక్తి వేషాలు ,మ్యూజికల్ నైట్ అలరించాయి. కోనసీమ నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు ఉత్సవాలను తిలకించేందుకు తరలివచ్చారు.సర్పంచ్ దాసరి అరుణ, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి స్వామివారిని దర్శించుకుని విజయబేతాళ స్వామికి పూజలు చేసారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు బొంతు పాపాయి, యిళ్ల ఏడుకొండలు, చొల్లింగి సుబ్బిరామ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమలాపురం సీఐ వీరబాబు ఆధ్వర్యంలో సర్కిల్లోని పోలీసు సిబ్బంది, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.